క్లుప్తంగా

వైద్యశాఖ సేవలు మరువలేనివి



అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారిని, సిబ్బందిని అభినందిస్తున్న జమ్మాన ప్రసన్న కుమార్

బలిజిపేట: వైద్యశాఖ సేవలు అభినందనీయమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్యశాఖ సిబ్బంది అందించిన సేవలను గుర్తిస్తూ బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్‌ను, సిబ్బందిని ఆయన శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా వారికి మెమెంటోలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా వైద్యం

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పల్లెలో వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు.

సజావుగా ఎస్‌ఈఏఎస్ పరీక్ష



ఎస్‌ఈఏఎస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌ఈఏఎస్ పరీక్ష సజావుగా జరిగిందని ఎంఈఓ–1సామల సింహాచలం తెలిపారు. మండలంలో 18 కేంద్రాల్లో 549మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 30మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌ను నియమించామని చెప్పారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలను ప్రత్యేక ప్యాకింగ్‌చేసి నిర్ధారించిన ప్రకారం పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరులో పరీక్ష ప్రశాంతం



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్

సాలూరు: పట్టణం, మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సర్వే పరీక్షలను ఎంఈఓ రాజ్‌కుమార్ పరిశీలించారు. 30 కేంద్రాలలో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

సమగ్ర భూ సర్వేతో సత్ఫలితాలు : జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

వీరఘట్టం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహనరెడ్డి తలపెట్టిన సమగ్ర భూసర్వేతో సత్ఫలితాలు వస్తున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు పేర్కొన్నారు. వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేటలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూసర్వేతో లబ్ధి పొందిన రైతులతో శుక్రవారం మాట్లాడారు. సర్వే వల్ల తగాదాలు లేని భూమి తమకు దక్కిందని రైతులు సంతృప్తి వ్యక్తం చేసారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సర్వే బృందాలు రీ–సర్వేను వేగవంతంగా చేపట్టాలని జేసీ సూచించారు. తహసీల్దార్ సత్యనారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సొంట్యాన సింహాచలం తదితరులు ఉన్నారు.

పెదభోగిలిలో అభివృద్ధి పనులు



పెదభోగిలిలో జరుగుతున్న కాలువలు, రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సరిగ్గా ఏడాదిన్నర క్రితం ప్రారంభించింది. ప్రజలకు మరింతచేరువయ్యే అవకాశం వచ్చిందే తడవుగా పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఒకయజ్ఞంలా చేపట్టి 300 రోజులు నియోజకవర్గపరిధిలో గల 76 సచివాలయాల్లో 100కు పైబడి గ్రామాలు, వార్డులలో ప్రతిగడపను విడిచి పెట్టకుండా ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి మార్గం చూపారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు అభివృద్ధిని చూపిస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నారు. ఈ క్రమంలోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు తిరగడంతో పెదభోగిలి గ్రామం ముఖచిత్రమే మారిపోయింది. కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక దశాబ్దాలుగా ఆ గ్రామ ప్రజలు ఎన్నో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న తీరును స్వయానా పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు నిధులు విడుదలచేసి పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయిస్తున్నారు. మానవతా దృక్పథంతో ఎమ్మెల్యే జోగారావు అభివృద్ధి చేస్తుండడం నిజంగా మా అందరి అదృష్టంగా భావిస్తున్నామని గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

కాలువలు, సీసీ రోడ్ల పరిశీలన

మండలంలోని పెదభోగిలిలో దశాబ్దాల క్రితం ఏర్పడిన ఎస్సీ, బీసీ కాలనీల్లో కాలువలు, రోడ్లు లేక పోవడంతో దోమలకు నిలయమవడం వల్ల తరచూ వ్యాధుల బారిన పడుతున్నామని గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో కాలనీవాసులు ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు రూ.20 లక్షలతో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మండలానికి మంజూరు చేయించిన రూ.3 కోట్లతో కాలువలు, సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసీ ఎస్.గౌరి, పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు, వార్డు మెంబరు పి.సతీష్‌కుమార్, పార్టీ మండల నాయకులు పి. ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్థసారథి, ప్రసాద్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

'జగన్ ఎందుకు కావాలి'ని విజయవంతం చేయాలి

పార్వతీపురం నియోజకవర్గంలో 9వ తేదీనుంచి నిర్వహించనున్న 'ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండల స్థాయి, గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మండలంలోని నిడగల్లులో అస్వస్థతకు గురై ఇంటివద్ద కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ మండలనాయకుడు గాజాపు శ్రీనివాసరావును పరామర్శించడానికి శుక్రవారం రాత్రి వచ్చిన ఆయన త్వరలో జరగనున్న కార్యక్రమాలపై మండల స్థాయి నాయకులతో సమీక్షించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్‌వీడీ కళాశాలలో సదస్సు



ఎస్‌వీడీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించిన నాబార్డ్ డీడీఎం నాగార్జున

పార్వతీపురంటౌన్: విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎస్‌వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థికఅక్షరాస్యత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పొదుపుచేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలా చేసిన పొదుపును సురక్షితంగా ఉండే పథకాల్లో ఎలా భద్రపరుచుకోవాలో వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియంత్రిత సంస్థల్లో మాత్రమే డిపాజిట్లు చేయడం లేదా అప్పు తీసుకోవడం చేయాలని హితవు పలికారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, బ్యాంకు కస్టమర్లు ఎవరికీ ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్ చెప్పరాదని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన తెలియని లింక్‌లను క్లిక్‌చేసి కష్టార్జితాన్ని సైబర్ మోసగాళ్లకు అర్పించవద్దని కోరారు. ఒక వేళ పొరపాటున ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే తక్షణమే 1930 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ బి.రాఘవేంద్ర, ఎస్‌వీడీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతిరావు, పట్టణ ఎస్సై దినకర్, ఏపీజీవీబీ పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ టి.కృష్ణసాగర్, నోడల్ అధికారి జె.వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



దిశయాప్‌పై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మహిళల ఆత్మరక్షణకు ప్రభుత్వం అమలు చేసిన దిశ యాప్‌ను ఫోన్ వినియోగదారులందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాష్ట్ర రహదారి ప్రధాన కూడళ్లలో 'దిశ యాప్ ఉపయోగాలు'పై విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలకేంద్రంలో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ అనంతరం మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు అందరూ దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మహిళలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.కాలేజీలో దిశ యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించుకుని గ్రామాల్లో సచివాలయ పోలీస్ సిబ్బంది ద్వారా ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. సచివాలయాల పరిధిలో సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.శ్రీనివాసరావు,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రాజశేఖర్ కోరారు. ఈ మేరకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు చేపట్టే విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పార్వతీపురంలోని సుందరయ్యభవనంలో శుక్రవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాలు విద్యాసంస్థల బంద్‌ను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌ఓ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు కె. రాజు, సీహెచ్ సింహాచలం, ముఖేష్, నాగేంద్ర, పి.రవికుమార్ ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ రేపు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఈ నెల 5న జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు మజ్జి పైడిరాజు, కురమాన గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ వేడుకలు జరుగుతాయని, సంఘ సభ్యులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు



లబ్ధిదారులకు ఇచ్చిన కుళ్లిన కోడిగుడ్లు

సీతంపేట: మండలంలోని కొత్తగూడ గ్రామంలోని గర్భిణులకు, చిన్నారులకు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం నుంచి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినట్టు గిరిజన ప్రజాసమాఖ్య నాయకుడు మోహన్‌పాల్ ఆరోపించారు. లబ్ధిదారులకు తమకు ఇచ్చిన కోడిగుడ్లు పాడైపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పోషకాహారంలో భాగంగా ఇటువంటి నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్న టెండర్‌దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సీడీపీఓ రంగలక్ష్మి వద్ద ప్రస్తావించగా ఇప్పటికే సరఫరా చేసిన వాటిని వెనక్కి తీసుకుని కొత్తవి మళ్లీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బదిలీ డాక్టర్లకు సత్కారం



సీహెచ్‌ఓను సత్కరిస్తున్న హెల్త్‌సూపర్ వైజర్లు, వైద్యసిబ్బంది

సీతానగరం: ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సహజమే అయినా విధి నిర్వహణలో వారందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. దీర్ఘకాలంగా పీహెచ్‌సీలో రోగులకు సేవలందించిన డాక్టర్ కె, శిరీష (చిన్న పిల్లల స్పెషలిస్ట్)పీజీ శిక్షణకు వెళ్తున్న సందర్భంగా ఆమెను శుక్రవారం సత్కరించారు. అలాగే దీర్ఘకాలంగా పీహెచ్‌సీలో సేవలందించి బదిలీపై వెళ్లిన సీహెచ్‌ఓ జి ఈశ్వరమ్మ, ఇక్కడికి బదిలీపై వచ్చిన సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, ఇక్కడికి డాక్టర్‌గా వచ్చిన డాక్టర్ ఉషారాణిని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది 104 సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల డాక్టర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన సచివాలయం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చిదిమి సచివాలయం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో అత్యాధునిక హంగులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కొద్ది రోజుల్లో ఈ భవనాన్ని ప్రారంభిస్తామని జేఈ కళ్యాణిదుర్గ శుక్రవారం తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మరో రూ.3.6 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సచివాలయం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసి ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నెరవేరుస్తామని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఇళ్ల బిల్లుల చెల్లింపుపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రరావు, ఏఈ చంద్రశేఖరనాయుడు

భామిని: మండలంలో మంజూరైన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు, బిల్లుల చెల్లింపుపై మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ చంద్రశేఖరనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష జరిగింది. ఇంజినీరింగ్ సహాయకులతో ఆయన సమీక్షించారు. మండలంలో 13 లేఅవుట్లలో మంజూరైన 324 జగనన్న కాలనీ ఇళ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారు నిర్మించిన మేరకు బిల్లులు చెల్లింపులు చేపట్టిన వివరాలపై సమీక్షించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల స్థలాల కేటాయింపులపై వచ్చిన సమస్యలపై చర్చించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, వీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌తో బహుళ ప్రయోజనాలు



చింతలపాడు పాఠశాలలో కిచెన్ గార్డెన్ సాగుపై విద్యార్థులకు అవగాహన

గుమ్మలక్ష్మీపురం: కిచెన్ గార్డెన్ల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని చింతలపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కిచెన్ గార్డెన్లో పండించే ఆకుకూరలు, కాయగూరలు మధ్యాహ్న భోజనం కూరల్లో ఉపయోగించడం వల్ల పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. చిన్నతనం నుంచే ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే విధానం అలవాటు అవుతుందని, ఇక్కడి విషయాలు తల్లిదండ్రులతో ముచ్చటించుకోవడం వలన వారి యొక్క సొంత క్షేత్రాల్లో కూడా సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దుడ్డుఖల్లు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను కూడా పరిశీలించారు. నిరంతరం ఆదాయం వచ్చేలా ఏడాది పొడువునా సాగు చేసుకోవాలని, అవసరమైన సలహాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు. డీపీఎం పి.షణ్ముఖరాజు, ఎంటీలు స్వామినాయుడు, ఎల్.నరసింహా, జి.నిర్మల, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



తవిటినాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం అందజేస్తున్న గౌరీశంకరరావు

జియ్యమ్మవలస: కన్నపుదొరవలస గ్రామానికి చెందిన బంటు తవిటినాయుడు 108లో పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రూ.10వేలు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నపూర్ణ, ఎంపీటీసీ రవికుమార్ ఉన్నారు.

కళ్లాల వద్దే ధాన్యం కొనుగోలు



సమావేశమైన వ్యవసాయ శాఖ సిబ్బంది

వీరఘట్టం: ఈ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం చేపట్టడంతో పాటు రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం నాణ్యతను పరిశీలించేందుకు సిబ్బంది అంతా సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ వాహనానికి జీపీఎస్ ఉంటుందని తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపడదామని పిలుపునిచ్చారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లి గోవిందరావు

పాచిపెంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జరిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అంగీకరించడంపై స్థానిక ప్రెస్‌క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లి గోవిందరావు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలనుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సమన్వయకర్త దండి ఏడుకొండలు, కార్యదర్శి ఇజ్జపరువు గౌరీశ్వరరావు, ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ రమణ, ప్రెస్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో జోరందుకున్న అభివృద్ధి..



అభివృద్ధి పనుల్లో పాల్గొన్న గిరిజనులు



పట్టుచెన్నేరులో జరుగుతున్న రిటర్నింగ్ వాల్ పనులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో ఏజెన్సీలో అభివృద్ధి పరుగులెడుతోంది. గిరిశిఖర గ్రామాల్లో ప్రజలు కూడా అభివృద్ధి పనుల్లో పాలు పంచుకుంటున్నారు. గడప గడపకు మనప్రభుత్వం నిధులు, ఐటీడీఏ, పంచాయతీరాజ్, తదితర శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గిరిశిఖర గ్రామాలకు కొండల నుంచి నీరు రాకుండా రిటర్నింగ్ వాల్‌లు, సీసీ రోడ్లు, తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవ తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చెబుతున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ముఖ్యంగా మహిళలు, బాలికలకు భద్రతకు కల్పించబడ్డ చట్టాలపై న్యాయవాదులు కర్రా రవి, వెంకటేష్, శివదాసు తదితరులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గవర రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం

పాలకొండ: జగనన్న గృహ నిర్మాణ పథకంలో పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి సూచించారు. మండల పరిషత్ కార్యాయలంలో ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించామని అందుకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.